సాక్షి తిరుపతి

గురువారం । 15 । ఆగస్టు । 2024



త్రివర్ణం.. సగర్వం

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో 133 అడుగుల ఎత్తులో భారీ జాతీయ పతాకం ఏర్పాటు చేశారు. - IIలో



బాధిత వలంటీర్లకు జగనన్న అండ

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ నేతల దాడుల్లో నష్టపోయిన వలంటీర్లకు జగనన్న చేయూతనందించారు. - IIలో



పవిత్రోత్సవాలకు అంకురార్పణ

గురువారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు.

"

● వాయల్పాడుకు చెందిన లోకనాథం దంపతులు జ్వరంతో బాధపడుతున్న తమ కుమారుడిని ఇటీవల రుయా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ల్యాబ్‌లో రక్త పరీక్షల నిమిత్తం శ్యాంపిల్స్ ఇచ్చారు. రిపోర్టులో డెంగీ జ్వరం అని తేలడంతో వైద్యుల సూచన ప్రకారం ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బ్లడ్ రిపోర్టు కనపడకుండా పోయింది. దీంతో ల్యాబ్‌కు వెళ్లి కొత్త రిపోర్టు తీసుకురావాలని లోకనాథం దంపతులకు వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని ఆ దంపతులు రుయా ల్యాబ్ సిబ్బందికి తెలియజేయగా, వెయిట్ చేయండి అంటూ వారిని గంటల తరబడి కూర్చోబెట్టేశారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు రిపోర్టును రీప్రింట్ చేసి ఇచ్చారు. దీనిలో సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనబడినా రుయా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు.

● అనంతపురానికి చెందిన పరమేశ్వరప్ప రెండు నెలల క్రితం యూరిన్ సమస్యతో రుయా ఆస్పత్రిని ఆశ్రయించాడు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఆపరేషన్ అవసరమని చెప్పారు. ఈ మేరకు నెల తర్వాత శస్త్రచికిత్స పూర్తి చేశారు. వైద్యం అందించిన అన్ని రోజులూ మందులు బయట తెచ్చుకోవాలని చెప్పారని, ఎక్కువ మోతాదులో తనతో కొనిపించారని బాధితుడు సాక్షితో వాపోయారు. కనీసం రూ. 20వేల వరకు బయట మందుల షాపులో మెడిసన్ కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇంత పెద్ద రుయా ఆస్పత్రిలో అవసరమైన మందులు లేవనడం ఏంటని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నా తమకు వర్తించదంటూ ఆస్పత్రి అధికారులు చెప్పడంతో ఏమీ చేయలేక పోయామని తమ గోడు వెల్లబోసుకున్నారు.

పరీక్షల కోసం ఎదురుచూపులు



రాయలసీమకే తలమానికం.. నాలుగు జిల్లాల్లో అతి పెద్ద హాస్పిటల్.. నిత్యం వందలాది మంది రోగులకు సేవలందించే అపర ధన్వంతరీ స్థానం.. తిరుపతిలోని రుయా ఆస్పత్రి. ఒకప్పుడు నిరుపేదలకు ఆరోగ్య ప్రదాయినిగా పేరు గడించింది. ఇప్పుడు నిర్లక్ష్యపు నీడలో.. వసతుల లేమితో అప్రతిష్ట మూటగట్టుకుంటోంది. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న కొందరు వైద్యులు రూ.లక్షల్లో జీతాలు పుచ్చుకుంటారు. రోగులను మాత్రం కనీసం పట్టించుకోరు. తమ బాధ్యతలను జూనియర్ డాక్టర్లకు అప్పగించి ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. పేదల ఆస్పత్రిని గాలికి వదిలేసి తమ సొంత క్లినిక్‌ల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఆవు చేనులో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా..? అన్నట్టు.. గాడి తప్పిన వైద్యుల బాటలోనే సిబ్బంది సైతం నడుస్తున్నారు. అలవికాని అలసత్వంతో పేషెంట్లకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు.

రుయా సిబ్బంది అందుబాటులో లేక రోగిని తీసుకెళుతున్న బంధువులు



వైద్యుల తీరే వేరుయా!

నాడి పట్టరు.. రోగిని పట్టించుకోరు

- పీజీ విద్యార్థులతోనే చికిత్సలు
- అస్తవ్యస్తంగా అత్యవసర విభాగం
- కచ్చితత్వం లేని ల్యాబ్ రిపోర్టులు
- పడకేసిన పర్యవేక్షణ
- నిర్లక్ష్యపు నీడలో ట్రయేజ్ వ్యవస్థ
- ప్రైవేట్ గుప్పిట్లో స్కానింగ్ కేంద్రం
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత



రుయా ఆస్పత్రిలో సిబ్బంది వివరాలు

	ప్రస్తుతం ఉన్నవారు	ఉండాల్సినవారు
అధికారులు	2	4
డాక్టర్లు (సీటీ సర్జన్‌లు)	0	3
వైద్యులు	82	106
స్టాఫ్ నర్సులు	341	448
ఇతర సిబ్బంది	723	986
పారిశుద్ధ్య కార్మికులు	90	220

ఓపీ కోసం క్యూలో వేచిఉన్న వృద్ధులు





రోగులకు వైద్యసేవలు అందిస్తున్న పీజీ విద్యార్థులు

తిరుపతి తుడా / తిరుపతి సిటీ : తిరుపతి రుయా (శ్రీ వెంకటేశ్వర రామ్‌నారాయణ్ రుయా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి)కి మరో పేరుంది. రాయలసీమ పెద్దాసుపత్రిగా పేరొందింది. వైద్యులుగా ఉంటే ఆ పేరు ప్రతిష్టలే వేరు. తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాల నుంచి ఈ ఆస్పత్రికి వైద్యం కోసం రోజూ 1,200 నుంచి 1,400 మంది వరకు రోగులు వస్తుంటారు. వ్యయప్రయాసల కోర్చి వచ్చే రోగులకు ఆ స్థాయిలో వైద్యం అందడం లేదు.

సక్రమంగా అందని అత్యవసర సేవలు

రుయా అత్యవసర విభాగం అస్తవ్యస్తంగా తయారైంది. రోగులకు నాణ్యమైన వైద్యం పూర్తి స్థాయిలో అందడం లేదు. సీఎంఓలు, సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. ఉన్నా నాడి పట్టడానికి మొగ్గు చూపడంలేదు. ప్రధానంగా రాత్రి సమయంలో వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారు. రాత్రి వైద్యం పూర్తిగా పీజీ విద్యార్థులు, నర్సుల మీదే భారం పడుతోంది. దీంతో అత్యవసర విభాగంలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. ఓపీలోనూ ఇదే సమస్య ఎదురవుతోంది. ఒక్కోరోజు ఒక్కో యూనిట్‌కు సంబంధించిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్, పీజీలు ఎంబీబీఎస్ విద్యార్థులు ఓపీ విధులకు హాజరవుతుంటారు. అయితే కొన్ని విభాగాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండటం లేదు. సొంతపనులపై కొందరు వెళ్లిపోతున్నారు. మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యక్షమవుతున్నారు.

స్కాన్ ప్రక్రియలో ప్రైవేట్ హవా

పేద రోగుల కోసం అత్యంత ఖరీదైన ఎమ్ఆర్ఐ, సిటీ స్కానింగ్ సేవలను రుయా ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నారు. అయితే వీటి నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఇందుకోసం ప్రతి నేల రూ.95లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అంతాబాగున్నా .... అల్లుడి నోట్లో శని అనే చందంగా పేద రోగుల కోసం ఏర్పాటు చేసిన ఎమ్ఆర్ఐ, సిటీ స్కానింగ్‌ల ప్రక్రియ ప్రైవేట్ మాఫియా చేతులలోకి వెళ్లి లక్ష్యం నీరుగారింది. పేద రోగులు స్కానింగ్ చేసుకోవాలంటే కనీసం 2రోజుల పాటు ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న రుయా వైద్యులు సిపార్సు చేసిన వారికి మాత్రం గంటలోనే స్కానింగ్ తీసి పంపేస్తున్నారు. బయట రూ.4 వేల నుంచి రూ.10వేల వరకు ఒక్కో ఎమ్ఆర్ఐకి వసూలు చేస్తున్నారు. రుయాలో ఉచితం కావడంతో ఎమ్ఆర్ఐ కోసం ప్రైవేట్ ఆస్పత్రుల్లోని రోగులు సైతం ఇక్కడికే వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కైన రుయా స్కానింగ్ నిర్వాహకులపై అనేక విమర్శలు తలెత్తినా ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

పనిచేయని ఏసీలు

రుయా అత్యవసర విభాగంలో 24గంటలు ఏసీ ఉండాల్సి అవసరం ఉంది. ఇక్కడ 9 ఏసీలు ఉండగా కేవలం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. కిటికీలు శిథిలావస్థకు చేరడంతో అరకొర ఏసీ నుంచి వచ్చే చల్లదనం కాస్తా బయటకు వెళ్లిపోతోంది. దీంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. తీవ్రమైన ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!



సెల్‌ఫోన్ చోరీపై ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి

వైద్యం కోసం పలు ప్రాంతాల నుంచి రుయాకు వచ్చే రోగులకు దొంగల బెడద తప్పడం లేదు. కొద్దిసేపు ఆదమరచినా.. వెంటనే ఏదో ఒక వస్తువును అపహరించేస్తున్నారు. నిత్యం పదికి పైగా దొంగతనాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. సీసీ కెమెరాల వ్యవస్థ పటిష్టంగా ఉన్నా చోరీలకు మాత్రం అధికారులు అడ్డుకట్ట వేయలేకపోవడం గమనార్హం. ఇటీవల అన్నమయ్య జిల్లా బుక్కపట్నం మండలం, నరసంపల్లె తాండాకు చెందిన బనారత్ సాయికుమార్ నాయక్ అనే వ్యక్తి వైద్యుడి అవతారం ఎత్తి ఓ రోగిని నిలువు దోపిడీ చేసిన ఉదంతం సంచలం రేపింది. రోగితో మాటలు కలిపి, వైద్యుడినని నమ్మబలికి ఏటీఎం కార్డును తీసుకుని రూ.40వేలు నగదు, సెల్‌ఫోన్‌తో ఉడాయించాడు. ఈ ఘటన మరవకముందే సోమవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో రెస్పెక్టరీ థెరఫీ టెక్నీషియన్ కోర్సు చదువుతున్న గోపి అనే విద్యార్థి మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించారు. దీనిపై సదరు విద్యార్థి వెంటనే రుయా సెక్యూరిటీ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే పలు ద్విచక్రవాహనాలు సైతం ఇక్కడ తరచూ అపహరణకు గురవుతున్నాయి.

రోగిని తీసుకెళుతున్న బంధువులు



కనిపించని ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓలు

ఆస్పత్రిలో రోగులను వివిధ పరీక్షల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సుమారు 10 నుంచి 150 మీటర్లకు పైగా స్ట్రెక్చర్లు, వీల్ చైర్లలో తీసుకెళ్లాల్సి ఉంది. ఇందుకోసం రుయాలో సుమారు 100 మందికిపైగా ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓలు ఉన్నారు. అయితే వారు రోగుల అవసరాలకు ఉపయోగపడడం లేదు. దీంతో అతికష్టం మీద రోగుల బంధువులే వార్డు నుంచి ల్యాబ్, ఎమ్ఆర్ఐ, సిటీ, ఎక్స్‌రే విభాగాలకు తీసుకెళుతున్నారు. అత్యంత జాగ్రత్తగా తీసుకెళ్లాల్సిన రోగులను సైతం పట్టించుకోరు. కేవలం అధికారుల ప్రాపకం కోసం పాకులాడే పని ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓలు నిమగ్నమై కనిపిస్తుంటారు.

ల్యాబ్‌లోనూ మాయాజాలమే..!

రుయా ఓపీ విభాగం వద్దే ల్యాబోరేటరీ ఉంది. అయితే ఇక్కడ ల్యాబ్‌లో ఫలితాలను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వెలుగు చూసిన అనేక ఉదంతాలే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే ల్యాబ్‌కు వచ్చిన రోగులను కొందరు సిబ్బంది ప్రైవేటు ల్యాబ్‌లకు పంపుతున్నారు. ల్యాబ్‌లో పనిచేస్తున్న వినోద్ అనే ఉద్యోగి బయట ప్రైవేటు ల్యాబ్‌లు నిర్వహిస్తూ ఖరీదైన పరీక్షలను అక్కడికి రెఫర్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం రుయా అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు ఉండిపోతున్నారు. దీంతో ఆ ఉద్యోగి మరింత విచ్చలవిడిగా దోపిడీకి తెరతీస్తున్నాడు.



రుయాలోని అత్యవసర విభాగం

పడకేసిన పారిశుద్ధ్యం



రోగుల వార్డు పక్కనే చెత్త కుప్ప

రుయాలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. ప్రధానంగా బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ తీరు ఆందోళన కలిగిస్తోంది. రుయాలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రతినెల రూ.45లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుయాలో 220మంది చేత పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సి ఉంది. ఏ1 సర్వీసెస్ నుంచి మరో వ్యక్తి సబ్ కాంట్రాక్ట్ తీసుకుని కేవలం 90మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులను చేయిస్తూ 220 మంది వేతనాలను కాజేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరుకోసం 130 మందిని నియమించుకుని ఒక్కోక్కరి నెలకు రూ.4వేలు చెల్లిస్తున్న విషయం బహిర్గతమైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ జీఓ ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.18వేల వేతనం చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ. 10వేల నుంచి రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వ సొమ్మును కాంట్రాక్టర్ దోచేస్తున్న విషయం అధికారులకు తెలిసినా తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని కార్మికులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు.

ఓపీ కోసం బారులు తీరిన రోగులు



పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

తిరుపతి అర్బన్ : పంద్రాగస్టు వేడుకలకు సంబంధించి సర్వం సిద్ధ చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ గురువారం తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశభక్తి ఉట్టిపడేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో జరుపుకోవాలని చెప్పారు. ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలో కాన్వాస్ ఏర్పాటు చేసి అందులో సంతకాలు, దేశభక్తి అంశాలు రాయించాలని కోరారు. జెండాతో సెల్ఫీ దిగి హర్ ఘర్ కాతిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పరేడ్ వేడుకల్లో జాతీయ సంస్కృతి ఉట్టిపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. 11 స్టాల్స్‌తోపాటు 7 శకటాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.



తిరంగా కాంతులీనుతున్న కలెక్టర్ క్యాంప్ కార్యాలయం

ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి క్రైమ్ : తిరుపతి ఎమ్మార్‌పల్లె సమీపంలోని ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఏర్పాట్లను కలెక్టరవెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశామన్నారు. పతాక ఆవిష్కరణకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శన, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. అలాగే పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్టేజ్ డెకరేషన్, పారిశుద్ధ్య నిర్వహణ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకల వీక్షణకు విచ్చేసే ప్రజలకు తాగునీరు, సీటింగ్ వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

- 8.55 : ముఖ్యఅతిథి, కలెక్టర్ ఆగమనం
- 9.00: మంత్రి చేతులమీదుగా జాతీయ పతాకావిష్కరణ
- 9.05 : పోలీసుల గౌరవ వందనం స్వీకరణ
- 9.20 : మంత్రి సందేశం
- 9.45 : శకటాల ప్రదర్శన
- 10.00 : విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- 10.30 : ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాల ప్రదానం
- 11.00 : స్టాల్స్ సందర్శన
- 11.30 : జాతీయ గీతాలాపన

క్లుప్తంగా

రూ.86.33 లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్ : తిరుపతి రూరల్ మండలం మంగళం క్వార్టర్స్‌కు చెందిన కె.హేమంత్ కుమార్ అనే వ్యాపారి తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.86.33లక్షలకు ఐపీ పిటిషన్ దాఖలు చేశాడు. వ్యాపారంలో నష్టం రావడంతో రుణదాతలకు సొమ్ము చెల్లించలేనని తెలిపాడు. 18 మంది రుణదాతలను ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

బాలికలకు ఉపకార వేతనాలు



స్కాలర్‌షిప్ అందిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

తిరుపతి(అలిపిరి): బాలికా విద్యకు కెనరా బ్యాంకు చేయూతనిస్తోందని.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థినులకు సాయం అందిస్తున్నామని జనరల్ మేనేజర్ పాండురంగయ్య తెలిపారు. గురువారం తిరుపతిలోని కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో 60 పాఠశాలలకు చెందిన 360 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 5 నుంచి 7వ తరగతి పిల్లలకు ఏడాదికి రూ.3 వేలు, 8 నుంచి 10వ తరగతి వారికి రూ.5 వేలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జీఎం జీఎస్ మూర్తి, అసిస్టెంట్ జీఎం టి.నాగరాజారావు, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి పాల్గొన్నారు.

19న శ్రావణ ఉపకర్మ

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 19వ తేదీన శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రావణ ఉపకర్మ నిర్వహించనున్నారు. శ్రీగోవిందరాజస్వామి, శ్రీకృష్ణస్వామివారిని కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా తీసుకెళ్లి, స్నపన తిరుమంజనం, ఆస్థానం జరిపించనున్నారు.

ఎవరి మెప్పు కోసం?

- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఉద్యోగుల నుంచి వసూళ్లు
- వీఆర్‌ఓ రూ.10 వేలు ఇవ్వాలి



గూడూరులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గూడూరులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఉన్నతాధికారులు ఉద్యోగుల నుంచి వసూళ్లు మొదలుపెట్టారు. ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో గూడూరులో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవాన్ని వేదికగా చేసుకున్నారు. గూడూరు పట్టణ నడిబొడ్డులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే విధంగా వివిధ శాఖలకు చెందిన 10 శకటాలను ఏర్పాటుచేస్తున్నారు. మూడు కేరళ బృందాలతో నృత్యాలు, బాణసంచాలు వంటివి ఏర్పాటుచేసేందుకు సిద్ధమయ్యారు. నలుగురు ఎమ్మెల్యేను ఆ వేదికపై తీసుకుని వచ్చేందుకు ఆహ్వానాలు పలికారు.

అయితే దీనికయ్యే ఖర్చులు భరించేందుకు గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల తహసీల్దార్లు ఒక్కొక్కరు రూ.లక్ష, ప్రతి వీఆర్‌ఓ రూ.10 వేలు ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు జారీచేశారు. ఎవరి మెప్పుకోసం కింది స్థాయి ఉద్యోగుల వద్ద వసూళ్లు అంటూ మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వ హయాంలో ఇదే ఆర్డీవో రెండు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకను సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. అప్పట్లో ఇదేమిటి తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు.. అంటే ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని అంత డబ్బు ఎవరు ఇస్తారు అని తప్పించుకున్నారు.

త్రివర్ణం.. సగర్వం



తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట సమీపంలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌లో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భారీ జాతీయ పతాకం ఏర్పాటు చేయించారు. గురువారం సుమారు 133 అడుగుల ఉడెన్ పోల్‌పై ఎగురుతున్న జెండాకు వందనం సమర్పించనున్నారు. పతాకావిష్కరణ కోసం బర్మా నుంచి ప్రత్యేకంగా టేకు కొయ్యను తెప్పించారు. ఈ జెండా గిన్నిస్‌బుక్‌లో సైతం స్థానం దక్కించుకునే అవకాశముందని పలువురు వెల్లడిస్తున్నారు.

– తిరుపతి రూరల్

అకడమిక్ కన్సల్టెంట్ల సమస్యలు పరిష్కరించండి



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. వారు బుధవారం వీసీ అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులకు రెండు నెలలుగా జీతాలు అందలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి అకడమిక్ కన్సల్టెంట్లను 11 నెలలు కొనసాగించేందుకు జీఓఆర్‌టీ–110 ద్వారా ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదని తెలిపారు. కోర్టు అనుమతితో వచ్చిన తాత్కాలిక అధ్యాపకులకు కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చి వేతనాలు చెల్లిస్తున్నారని, మానవతా దృక్పథంతో 240 మంది అధ్యాపకులను ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్వీయూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, దళిత విద్యార్థి సేన వ్యవస్థాపకులు యుగంధర్, బీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి జేడీ ప్రసాద్, జీజేఎస్ వ్యవస్థాపకులు మహేంద్రనాయక్, ఏపీ వీహెచ్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రూకేష్, ముని, నరేస్, సాయి, దినేష్ పాల్గొన్నారు.

నేడు స్విమ్స్‌లో ఓపీకి సెలవు

తిరుపతి తుడా: స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో గురువారం స్విమ్స్ ఆస్పత్రిలో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటించినట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ బుధవారం తెలిపారు. అత్యవసర వైద్య విభాగం మాత్రం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

తిరుపతి సిటీ: ఐసెట్–2024 ద్వారా ఎస్వీయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లను శుక్రవారం నుంచి వెరిఫికేషన్ చేయనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. అభ్యర్థులు వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, ఈ నెల 21 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన రోజే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఏపీ ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

17న చేపల చెరువు వేలం

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లె చేపల చెరువుకు ఈ శనివారం వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చక్రాల బండ గుంటలో చేపలను ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు ఆధార్, పాన్ కార్డు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ పత్రాలు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, రూ.10లక్షలకు సాల్వెన్సీ సర్టిఫికెట్ లేదా బ్యాంకు గ్యారంటీ, రూ.10లక్షల డిపాజిట్ చెల్లించాలన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటల లోపు నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని పత్రాలు సమర్పించాలని సూచించారు.

తహసీల్దార్లపై ఎస్సీ కమిషన్ సభ్యుడి ఆగ్రహం

– సమావేశానికి ముగ్గురే రావడంపై అసహనం



మాట్లాడుతున్న ఆనంద ప్రకాష్

తిరుపతి అర్బన్ : జ్యుడిషియల్‌లో భాగంగా ఎస్సీ కమిషన్ సభ్యుడి హోదాలో తాను నిర్వహించిన సమీక్షకు తహసీల్దార్లు హాజరుకాకపోవడంపై ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో సివిల్ రైట్స్‌డే నిర్వహణపై తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమీక్ష చేపట్టారు. తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో 9 మండలాలు ఉండగా మూడు మండలాల తహసీల్దార్లు మాత్రమే హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సివిల్ రైట్స్ డేను ప్రతి నెలా చివరి వారంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కాకుండా ఆ పంచాయతీ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించాలని స్పష్టం చేశారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.67 లక్షల పరిహారాన్ని వెంటనే ఇప్పించాలని ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, ఆర్డీవో కార్యాలయ ఏవో ఝాన్సీలక్ష్మి, రామచంద్రాపురం, వడమాలపేట, చంద్రగిరి తహసీల్దార్లు వెంకటరమణ, జరీనా, శివ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

బాధిత వలంటీర్లకు జగనన్న అండ



మాజీ వాలంటీర్ మహేశ్వరికి చెక్ అందిస్తున్న వైకాపా నాయకులు,

శ్రీకాళహస్తి రూరల్ : టీడీపీ నేతల దాడిలో నష్టపోయిన ఇద్దరు వలంటీర్లకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి సిలవనూరు వాసుదేవరెడ్డి చేతుల మీదుగా బుధవారం చెక్కులు అందజేశారు. శ్రీకాళహస్తి మండలం వాగివేడు హరిజనవాడకు చెందిన వలంటీర్లు పృథ్వి, మహేశ్వరి ఇళ్లపై జూన్ 6వ తేదీన టీడీపీ మూకలు దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఒక్కొక్కరికి రూ.50 వేలు మంజూరు చేశారు. తమకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన జగనన్నకు పృథ్వి, మహేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా జగనన్న సైనికులుగా ప్రజల్లోనే ఉంటామని పేర్కొన్నారు. స్థానిక నాయకులు శ్రీనివాసులు రెడ్డి, సుబ్బరత్నయ్య, బి.లోకేష్, కె.సుబ్బరాయులు, కె.రమణయ్య పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకం



విద్యార్థులతో డీవైఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్పీజేఎన్‌ఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో పదోతరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బుధవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డీవైఈఓ బాలాజీ చేతులమీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ప్రోత్సాహకాలు అందుకున్నవారిలో జి.లక్ష్మణ్, 590మార్కులు (ఆర్‌ఎస్ మాడవీధి నగరపాలక హైస్కూల్), కె.మౌనిక, 580మార్కులు, అలాగే పి.ప్రదీప్, 579మార్కులు (డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ నగరపాలక హైస్కూల్)ఉన్నారు. నగరంలోని 9 పాఠశాలల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరచిన 27మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు.కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తహ సున్నీసా బేగం, ఎంఈఓ–2 భాస్కర్‌నాయక్, యూటీఎఫ్ నాయకులు బండి మధుసూదన్‌రెడ్డి, ఎస్.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,246 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,133 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో అధికారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు మహిళా ప్రాంగణంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 8 రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఓ పీడీ ప్రభావతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యాపారంలో రాణించడానికి అవసరమైన రుణ సౌకర్యం ముఖ్యంగా ముద్ర లోన్స్, అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ లోన్స్‌కు సంబంధించి వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ మురళి మాట్లాడుతూ తమ శాఖ ద్వారా ఎవరైతే ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఈడీపీ శిక్షణ పొంది ఉన్నారో వారికి కలెక్టర్ అనుమతితో వివిధ బ్యాంకులను సంప్రదించి పీఎంఈజీపీ పథకంలో భాగంగా రుణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్యామ్ మోహన్, మహిళా ప్రాంగణం అధికారి ఫర్హానా, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో వరుణ్ తేజ్ దంపతులు



తిరుమల: సినీ నటుడు వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి తిరుమలలో బసచేసి బుధవారం నైవేద్య విరామ సమయంలో స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపారు. వరుణ్ తేజ్ మీడియాతో మాట్లాడుతూ వివాహమైన తర్వాత మొదటి సారి శ్రీవారి దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట



ప్రిన్సిపల్ సెక్రటరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

తిరుపతి మంగళం : ప్రభుత్వ వసతిగృహాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఆదేశించారు. బుధవారం మంగళంలోని బాలుర హాస్టళ్లను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలతో అధికారులు సహనంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం హర్ ఘర్ కా తిరంగా ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్టళ్ల సూపరింటెండెంట్లు షణ్ముఖరావు, త్రినాథరావు, సుదర్శన్‌రెడ్డి, అధికారులు బి.మోహన్‌బాబు, జి.లక్ష్మీపతి, వి. శ్రీధర్, మోహనమూర్తి, పుష్పలత, పుల్లమరాజు పాల్గొన్నారు.

వీరనారీమణులకు సత్కారం



వీరనారీమణులను సత్కరిస్తున్న వీసీ, కమిషనర్

తిరుపతి సిటీ: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో వీరనారీమణులను, మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. బుధవారం వర్సిటీ ఇందిరాప్రియదర్శినీ ఆడిటోరియంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వీసీ ఉమ, నగరపాలక కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ కులశేఖర్ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఆర్డీ రమణప్రసాద్, ఏపీ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అంజువాద్వా, వే ఫౌండేషన్ డైరెక్టర్ అంకయ్య, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శోభాయాత్ర



సంస్కృత భాషా శోభాయాత్ర ర్యాలీలో వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో జరుగుతున్న సంస్కృత వారోత్సవాలలో భాగంగా వాగ్వర్ధినీ పరిషత్ ఆధ్వర్యంలో నగరంలో శోభాయాత్ర ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బుధవారం వర్సిటీలోని భరతమాత విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. సంస్కృత భాష విశిష్టతను తెలియజేసేలా సాగిన ఈ ర్యాలీలో ఐజర్ ప్రొఫెసర్ డాక్టర్ శంతన్ పాల్, రిజిస్ట్రార్ రమాశ్రీ, రజనీకాంత్ శుక్లా, లలితారాణి, కే అజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్ : తిరుపతి మొదటి అదనపు జూనియర్ జడ్జి సత్య కుమార్‌కు స్థానిక సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బాధ్యతలు అదనంగా ఇస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇన్ని రోజులు ఆ కోర్టుకు న్యాయమూర్తిగా వ్యవహరించిన తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ నుంచి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. తిరుపతి అర్బన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే కేసులను న్యాయమూర్తి విచారించి శిక్ష, జరిమానాలను విధించనున్నారు.

తప్పిన పెనుప్రమాదం



రామచంద్రాపురం: తిరుపతి–పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో ఓ ఆర్టీసీ బస్సు కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 35 మంది ప్రయాణికులతో తిరుపతి నుంచి పళ్లిపట్టుకు బయలుదేరింది. పీవీపురం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను దింపి వేయడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు కాస్త ముందుకు వెళ్లి ఉంటే విద్యుత్ తీగలు తెగిపడి పెనుప్రమాదం సంభవించి ఉండేది.

17న ఉపరాష్ట్రపతి రాక



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 17వ తేదీన రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్‌తో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి నెల్లూరు జిల్లా వెంకటాచలం వద్ద స్వర్ణ భారత ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి హాజరు కానున్నట్లు వెల్లడించారు. రేణిగుంట నుంచి ఆయన హెలికాప్టర్‌లో వెంకటాచలం వెళ్లనున్నట్లు చెప్పారు.. అలాగే ఈ నెల 19వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు శ్రీసిటీని సందర్శించనున్నట్లు వివరించారు. వీఐపీల పర్యటనలకు పకడ్బందీ భద్రత కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, సివిల్ సప్లయి మేనేజర్ వై.సుమతి, డీఎం హెచ్‌ఓ శ్రీహరి, శ్రీసిటీ జీఎం నారాయణ భగవన్, ఏపీఐఐసీ జెడ్‌ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.